క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్: బోథ్, నేరడిగొండ, సొనాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో ఈనెల 8, 9తేదీన పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 10న కొనుగోళ్లు యాధావిధిగా ప్రారంభమవుతాయన్నారు. రైతుల ఈ విషయం గమనించాలన్నారు.

అంగన్‌వాడీని సందర్శించిన విద్యార్థులు



వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఇచ్చోడ: అంగన్‌వాడీ, పోషకాహార ప్రాక్టికల్ లెర్నింగ్ సెషన్‌లో భాగంగా వివేకానంద హైస్కూల్ విద్యార్థులు దుబార్‌పేట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం పని తీరు, అందించే సేవలు, పోషకాహారం గురించి అంగన్‌వాడీ కార్యకర్త గంగుబాయిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖిని వర్మ, అధ్యాపకులు నాగేందర్, శిరీన్ సభా, సుమలత పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు కాపాడాలి



మాట్లాడుతున్న టీఏజీఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: దేశంలోని అడవులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానాన్ని మానుకోవాలని, అలాగే ఆదివాసీ హక్కులను కాపాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు డిమాండ్ చేశారు. మండలంలోని పిప్రి గ్రామంలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులు, రాజ్యాంగం కల్పించిన చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో గ్రామ కమిటీ సభ్యులు నర్సింగ్‌రావ్, శంభు, విఠల్, నాగోరావ్, జలపతి, బాలాజీ తదితరులున్నారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి కేశవ్‌రెడ్డి, బాలాపూర్‌కు చెందిన సుభాష్ ఇటీవలే మృతి చెందగా.. వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి జోగు రామన్న శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సర్పన్ లింగారెడ్డి, రాంరెడ్డి, జక్కుల వినోద్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డిలు పరామర్శించారు.

భేటీ బచావో.. భేటీ పడావోపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ బాలికల ఆశ్రమ పాఠశాలలో భేటీ బచావో.. భేటీ పడావోపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు, సేఫ్ టచ్ అన్ సేఫ్ టచ్, ఋతుక్రమ పరిశుభ్రత, హెల్ప్‌లైన్ నెంబర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు గోవింద్, రవి, సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

బోథ్: మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీకి చెందిన యువకులకు మానం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ శనివారం వాలీబాల్ కిట్ అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కిట్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు శ్రీధర్, కార్తీక్, రాజు, సాయి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన సీపీఐ నేతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి సీతక్కను ఆదిలాబాద్ జిల్లా సీపీఐ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాదులో భారత జాతీయ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి నేతృత్వంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిని రెడ్డి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్ పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మించేదెప్పుడో?

- టెండర్లు ఖరారైనా ప్రారంభం కాని పనులు
- పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు



అప్పటి ఎమ్మెల్యే వేసిన శిలాఫకం



ఆడిటోరియం నిర్మాణానికి కేటాయించిన స్థలం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆడిటోరియం నిర్మాణానికి ముందడగు పడడం లేదు. స్థలాన్ని కేటాయించడంతో పాటు టెండర్లు ఖరారైనప్పటికీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నారు. దీంతో ఐదు నెలలుగా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆడిటోరియం నిర్మాణానికి గతేడాది అక్టోబర్ 5న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్నట్లుగా ఆవిష్కరించిన శిలాఫలకం వెక్కిరిస్తోంది. ఆడిటోరియం నిర్మాణం జరుగకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

టెండర్ల ప్రక్రియ పూర్తయినా..

ప్రభుత్వపరంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగ వేడుకలు, మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలతో పాటు ప్రైవేట్‌గా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక వేదిక లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో వేలాది రూపాయల అద్దెలు చెల్లిస్తూ.. కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందిని దూరం చేసేందుకు ఆడిటోరియం నిర్మాణానికి ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. సీఎం హామీ నిధులు రూ.5కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇందు కోసం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఎకరంన్నర స్థలాన్ని కేటాయించారు. టెండర్లను సైతం ఆహ్వానించగా.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఆడిటోరియ నిర్మాణ పనులు దక్కించుకున్నారు. టెండర్ల ప్రక్రియ ముగిసినప్పటికీ పనులు ప్రారంభంలో మాత్రం ఒకడుగు కూడా ముందుకు పడలేదు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం

ఆడిటోరియం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. పనులను ప్రారంభిస్తున్నట్లుగా ఆడిటోరియ నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ కాంట్రాక్టర్ మాత్రం పనులు ప్రారంభించలేదు. టెండర్లను దక్కించుకోవడానికే పరిమితమయ్యారే తప్పా.. ఎలాంటి కసరత్తను చేయలేదు. ఫలితంగా ఆడిటోరియ పనులు ప్రారంభం కాకపోగా అందుకోసం వేసిన శిలాఫలకం వెక్కిరిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు ప్రారంభించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

> **బిల్లులు రాకపోవడంతో పనులు జాప్యం**
>
> రూ.5కోట్లతో ఆడిటోరియం నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ తీర్మాణం మేరకు టెండర్లను పిలిచాం. నిబంధనల మేరకు తక్కువ కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించాం. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. త్వరలోనే దాని నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – తిరుపతి, మున్సిపల్ డీఈ

బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు



రోడ్డు పక్కన కూర్చొని బస్సు కోసం వేచిచూస్తున్న మహిళలు

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్దకు రావాల్సిందే. అయితే ఆ రహదారికి ఇరువైపులా బస్‌షెల్టర్ లేకపోవడంతో మహిళలు రోడ్డు పక్కనే కూర్చొని బస్సు కోసం వేచిచూడాల్సి వస్తుందని సర్పంచ్ సోలంకి గీత, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.

గురుకృప దినోత్సవానికి సహకారం అందిస్తా..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి వద్ద ఈ నెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవానికి పూర్తి సహకారం అందిస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, కమిటీ సభ్యులు పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయ బంజారా దీక్షభూమి అభివృద్ధిపై చర్చించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, కమిటీ సభ్యులు రాథోడ్ రమేశ్, పవార్ దేవిదాస్, నరహరి రాథోడ్ పాల్గొన్నారు.

దీక్ష భూమికి ప్రత్యేక బస్సులు..

కొత్తపల్లి– హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి వద్ద ఈనెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవ సందర్భంగా ఈనెల 13 వరకు ప్రత్యేక బస్సులు నడపాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. శనివారం దీక్షభూమికి చేరుకున్న ఆర్టీసీ బస్సుకు దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఉట్నూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. శనివారం రవీంద్రనగర్ కాలనీలో బీజేపీ నాయకులు ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోజ్ పవార్, శిరీష్, సాయి శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: అయోధ్య అక్షింతలను భజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. శనివారం పొచ్చెర, కౌఠ(బి), బోథ్‌లో గ్రామాల్లో పంపిణీ చేశారు. పొచ్చరలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలతో అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించనున్నారని ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దబుగ్గారం గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం చేపట్టే భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు.

దరఖాస్తుల ఆహ్వానం

నేరడిగొండ: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ 2, అసిస్టెంట్ కుక్ 3 పోస్టులను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయనున్నట్లు ఎంఈవో భూమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల మహిళలు ఈనెల 10వ తేదీలోగా ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం టీఎస్ యూటీఎఫ్ మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కమిటీని ఎన్నికల అధికారి, జిల్లా ప్రధా కార్యదర్శి అశోక్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. విట్టల్, ఉపాధ్యక్షుడిగా బి.జ్ఞానోబా, కె.సంగీత, కోశాధికారిగా శుద్ధోధన్, కార్యదర్శులుగా నారాయణ, వీరయ్య, సాగర్, మల్లికా, శ్రీధర్, బాపూరావు, వాణిశ్రీ, ఎం.దేవేందర్, కమిటీ కన్వీనర్‌గా జె.పాండురంగ, సభ్యులుగా భూమన్న, సోషల్ మీడియా కన్వీనర్ జహీర్, కల్చరల్ కమిటీ కన్వీనర్ దేవిదాస్, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్ ఖాజా బాకర్ అలీని ఎన్నుకున్నారు.

సిరిచెల్మకు బస్సు ప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ గ్రామానికి శనివారం ఆర్టీసీ బస్సు ప్రారంభించారు. గత కొన్ని రోజుల నుంచి బస్సు సౌకర్యం లేక పోవడంతో గ్రామస్తులు ఇటీవల ఆదిలాబాద్ డిపో మేనేజర్‌ను కలిసి బస్సు నడిపించాలని విన్నవించినట్లు సర్పంచ్ లక్ష్మి కన్నమయ్య తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించిన డీఎంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కార్యదర్శి రాజేశ్వర్

నార్నూర్: మండల కేంద్రంలోని ఎస్ఆర్ఎస్ఆర్ ఫార్మర్ సొసైటీ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి రాజేశ్వర్, సీపీవో నరేశ్, ధాన్ ఫౌండేషన్ టీం లీడర్ రాథోడ్ నిలేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. లైసెన్స్ కలిగి దుకాణాల్లో మాత్రమే పత్తి అమ్మాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు దళారుల బెడద నుంచి తప్పించడానికే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కొట్నాక్ మాధవ్, చైర్మన్ మాడవి నాగోరావు, సభ్యులు నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన అవునూరి శ్రీనివాస్ అనారోగ్యం భారిన పడి చికిత్స చేయించుకోలేని పరిస్థితి ఉండడంతో గ్రామానికి చెందిన నాయకులు గొర్ల రాజు యాదవ్ రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు షురూ



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: అభయహస్తంలో భాగంగా ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఎంఈవో కార్యాలయంలో ప్రత్యేకంగా 16 కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీవో ఆనంద్, సూపరింటెండెంట్ శంకర్‌లు మాట్లాడుతూ.. ఒక్కొక్కరూ రోజుకు 70 చొప్పున అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గడువులోగా నమోదు చేసేందుకు మరిన్ని కంప్యూటర్లను సిద్ధం చేస్తామన్నారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో 11,655 దరఖాస్తు రావడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి మావల మండలంలోని వాఘాపూర్, మావల, బట్టిసావర్‌గాం గ్రామాల్లో పర్యటించి, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేరడిగొండ: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. దీంతో మండలంలోని పలు పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శులు శనివారం వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపర్చుతామని వారు పేర్కొన్నారు.

‘ఉజ్వల్ గ్రామీణ వికాస్’ సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న హేమవతి

ఇచ్చోడ: ఉజ్వల్ గ్రామీణ వికాస్ పథకాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఉజ్వల గ్రామీణ వికాస్ యోజన ఎన్జీవో హెచ్ ఆర్.హేమవతి అన్నారు. శనివారం మండల మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉజ్వల్ గ్రామీణ వికాస్ యోజన ఎన్జీవో కింద కుట్టుమిషన్ శిక్షణ పొందిన 20 మంది మహిళలకు, యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన వారికి త్వరలో కుట్టుమిషన్లు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చౌహన్ సునీత, గ్రూప్ లీడర్ స్వప్న, టీం లీడర్లు వెంకటేశ్, గోలి శివన్న, శిక్షకురాలు సాజియా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



బోథ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



ఇచ్చోడ: మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు వసతులు కల్పించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం మెనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఆయన వెంట ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

పట్టుదలతో చదవాలి

బోథ్: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని పట్టుదలతో చదవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మనబడి.. మన ఊరు కార్యక్రమంలో భాగంగా రూ.21 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడిలో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్ సింగ్, సర్పంచ్ గంగాధర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ఖండిపల్లె గ్రామంలో శ్రీసంత్ రామారావ్ విగ్రహ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ ప్రీతమ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సుభాష్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభం

బోథ్: బోథ్ పట్టణానికి ఆనుకుని ఉన్న కంద్రవాగుపై రూ. 2 కోట్ల 25 లక్షలతో నిర్మించే వంతెన పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ ప్రీతం రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, బొడ్డు శ్రీనివాస్, కదం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

ఎదులాపురం: తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏఎస్ రామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యజమాన్యం సన్మానించింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు